తాను అమ్మే మల్లెపూలతోబాటుగా ఇచ్చే గులాబీ పువ్వు చూసిన అమ్మాయిగారి కళ్ళల్లో మెరిసే మెరుపు చూడటం చాలా ఇష్టం రంగడికి. కాని ఆ మెరుపును కమ్మిన మబ్బు ఎక్కడికి చేర్చింది ఆమెను?

# పుష్యమి

కలపల్లి ఈశ్వరరావు

"మల్లెపూలు.... మల్లెపూలోయ్ !"

సూర్యుడు ప్రకృతి కాంతతో సరాగాలాడేందుకు పశ్చిమ కొండల లోనికి జారుకునే వేళ, ఆ అరుపు వీథంతా ప్రతిధ్వనించింది.

ఆ సమయంలోనే పుష్యమి తల్లి ఆమెకు జడకుచ్చులు బిగిస్తూ ఉంది. "అమ్మా, రంగడు వచ్చి నట్టున్నాడు" చెప్పింది పుష్యమి.

"సరే పిలువు." కుచ్చులకు చివరి ముడివేస్తూ అన్నది పుష్యమి తల్లి.

పుష్యమి జడను చూసుకుంటూ బయటకు పరుగుతీసింది. వీథి వాకిలి దగ్గర నిలబడి కేకవేసింది. "మల్లెపూలూ !"

రంగడు తిరిగి చూశాడు. ఆమెను చూడటంలోనే అతడి కళ్ళు మిలమిల మెరిశాయి. పెదాల మీద చిరునవ్వు విచ్చుకుంది.

"పూలు కావాలి."

అతడు తలూపి ఆ వైపు నడిచాడు.

రంగడికి పాతికేళ్ళ లోపు ఉంటుంది. తల్లీ తండ్రీ లేరు. ఊరి చివర పాకలో కాపురం ఉంటాడు. మార్కెట్‌లో పూలు కొని, వెదురు తట్టలో పెట్టుకుని వీథి వీథి తిరిగి అమ్మడం వాడి దినచర్య - వృత్తి.

లోపలికి వచ్చిన రంగడిని పలకరించింది లక్ష్మీకాంతమ్మ. "ఏరా రంగా ! ఈ రోజు మరీ పెందలాడే బయలుదేరావే?"

"అవునమ్మా" నవ్వాడు అతడు. అతడు ఆ ఇంట్లో గత రెండేళ్ళుగా పూలు ఇస్తున్నాడు. కాబట్టి కాస్త చనువుంది.

"మూర ఎంత?"

"మీ దగ్గర రేటేమిటమ్మా? ఎంతో కొంత ఇవ్వండి."


"రెండు మూర లివ్వు."

రంగడు రెండు మూరలు కొలిచి ఇచ్చాడు. ఆమె ఇచ్చిన చిల్లర వంక చూసుకోకుండానే జేబులో వేసుకున్నాడు. తర్వాత బుట్టలో ఒక మూలగా దాచి ఉంచిన గులాబీని తీసి ఆమె చేతికి ఇచ్చాడు "అమ్మాయి గారికి గులాబీలంటే ఇష్టంకదాని తీసుకొచ్చాను" చెప్పాడు అతడు.

ఆ పువ్వును చూడగానే పుష్యమి కన్నులలో మెరిసిన మెరుపును అతడు స్పష్టంగా చూశాడు. ఇది ఒకరోజు కాదు - ప్రతిరోజూ జరుగుతున్నదే. పుష్యమి కన్నులలోని ఆ మెరుపంటే అతడికి ఎంతో ఇష్టం.

పుష్యమికి పద్దెనిమిదేళ్ళుంటాయి. చాలా అందంగా ఉంటుంది. ముఖ్యంగా ఆమె కళ్ళు. ఆ కళ్ళు విశాలంగా ఉంటాయి. 'ఈ లోకాన్నంత ఆమె కన్నులలో చూడొచ్చు' అనిపిస్తుంది అతడికి.

"రోజూ ఇలా గులాబీ పువ్వు పట్టుకొస్తావు - డబ్బు ఇవ్వబోతే తీసుకోవు...." సన్నగా విసుక్కుంది లక్ష్మీకాంతమ్మ.




రంగడు నవ్వి ఊరుకున్నాడు. "వస్తానమ్మా."

వెనుతిరిగి రెండు అడుగులు వేశాడు. వీథివాకిలి తీయబోతూ వెనుతిరిగి చూశాడు. అప్పుడే - పుష్యమి ఆ గులాబీని జడలో సర్దుకుంటూంది.

ఆ దృశ్యం అతడికి అపురూపంగా అనిపిస్తుంటుంది. తను అలాగే చూస్తుండిపోవాలని అనిపిస్తుంది. కాని భావ్యం కాదు. అందుకే తల తిప్పుకుని వెళ్ళిపోతూంటాడు రంగడు. పూలన్నీ అమ్ముకున్న తర్వాత ఎప్పటిలానే తన గుడిసెకు చేరుకున్నాడు అతడు.

రాత్రి అన్నం వండుకుని తిని, పడుకున్నాక - మనసు నిండా ఏవో మధురోహలు. బుద్ధికి తెలుసు తారతమ్యాలేమిటో ! కాని మనసుకు 'స్పందించటం' తప్ప తారతమ్యాలు ఆలోచించేంత జ్ఞానం లేదు.

తీపికలలతో నిద్రపట్టింది.

కాలం మామూలుగానే నడుస్తూ ఉంది.

** ** **

ఆ రాత్రి సెకండ్ షోకి వెళ్ళాలనిపించింది రంగడికి.

ఊరికి రెండవ చివర ఉండే థియేటర్‌లో మంచి సినిమా ఆడుతుండడంతో దానికి వెళ్ళాడు.

ఆ థియేటర్‌కు వెళ్ళాలంటే, పుష్యమి వాళ్ళున్న వీథి పక్క వీథిలో నుండే వెళ్ళాలి.

సినిమా వదిలేశాక ఇంటికి తిరుగు బయలుదేరాడు అతడు. పుష్యమి వీథి మొదట్లోకి వచ్చాక ఎందుకనో మనసు అటుగా లాగింది. మెయిన్ రోడ్‌లో వెళ్ళకుండా ఒకసారి ఆ వీథి గుండా వెళ్తే? అటుగా వెళ్తే ఏ మొస్తుంది? అంటే తనేం చెప్పలేడు. కాని అదొక తృప్తి. 'ఆ ఇంటి పరిసరాలు' మరోమారు చూసుకున్న ఆనందం.

అతడు అటుగా నడిచాడు.

వీథి దీపాలు మసకగా వెలుగుతున్నాయి.

ఆ వాకిలి ఎదురుగా ఉన్న వేప చెట్టు కింద ఏదో ఆకారం అస్పష్టంగా కదిలింది. రంగడి కళ్ళు చురుగ్గా పని చేశాయి.

అతడు వేప చెట్టు దగ్గరగా నడిచి ఆ ఆకారం వంక చూశాడు. తనకన్నా నాలుగైదేళ్ళు చిన్న వయసుండే యువకుడు. ఏకాగ్రంగా పుష్యమి ఇంటి వైపే చూస్తున్నాడు. రెండు క్షణాల తర్వాత ఆ కుర్రాడు తలతిప్పి అతడిని చూసి కంగారుపడ్డాడు.

"ఏయ్, ఎవర్నువ్వు?" గదమాయించి అడిగాడు రంగడు.

ఆ కుర్రాడు బిక్క చచ్చిపోయాడు. "నేను.... నేను..." నసగసాగాడు.

"ఆం ! ఇక్కడేం చేస్తున్నావు?"

కుర్రాడు బదులు చెప్పేందుకు కొద్దిగా నోరు తెరిచాడు.

సరిగ్గా అదే సమయంలో ఆ ఇంటి తలుపు కిర్రుమన్న శబ్దం ఆ ప్రశాంత వాతావరణంలో గట్టిగానే వినిపించింది.

ఇద్దరూ ఒక్కసారిగా తలతిప్పి అటుగా

చూశారు.


కుర్రాడి కళ్ళు మిలమిల మెరిశాయి. రంగడు మాత్రం ఆశ్చర్యంలో మునిగిపోయాడు.

పుష్యమి వాకిలి దగ్గర నిలబడి ఉంది. అదికాదు. ఆశ్చర్యం కలిగించే విషయం ఆమె చేతిలోని సూట్‌కేస్. తను ఎక్కడికో బయలుదేరినట్టుంది.

రంగడిని చూడటంతోనే ఆమె మొదట కొద్దిగా భయపడింది. వెంటనే పెదాల మీదికి చిరునవ్వు తెచ్చుకుని వారి దగ్గరగా నడిచింది. అప్పుడు గమనించాడు రంగడు. - ఆ కుర్రాడి పక్కన కూడా మరో సూట్‌కేస్ ఉండటం. అయినా అతడికేమీ అర్థం కాలేదు. నోరు తెరిచి "అ... అమ్మాయిగారూ! ఏ... ఏమిటిదంతా?" అన్నాడు అయోమయంగా.

పుష్యమి నోటి మీద వేలేసుకుని "ష్ ష్..." అంటూ సైగ చేసింది. "రా రమేష్ వెళ్దాం" అని తను ముందుకు నడుస్తూ, రంగడిని కూడా వెంట రమ్మని కన్నులతోనే పిలిచింది.

రంగడు అప్పటికే ఏదో ఊహించుకున్నాడు. ఆ ఊహే షాక్ కొట్టినట్టయింది. ముఖంలో నిస్తేజం అలముకుంది. మరో లోకంలో ఉన్న వ్యక్తిలా



వాళ్ళిద్దరినీ అనుసరించాడు.

వీధి దాటి మెయిన్ రోడ్ ఎక్కాక పుష్యమి మాట్లాడింది. ఆమె చెప్పిన విశేషాలు రంగడిని ఆశ్చర్యాందోళనలలో పడేశాయి.

రమేష్ పుష్యమి క్లాస్‌మేట్స్. ప్రేమించుకున్నారా ఇద్దరూ. ఆ ప్రేమ ఇంట్లో వారికి తెలిసింది. ఇద్దరి తల్లితండ్రులు ఒప్పుకోలేదు. ఆ కారణంగానే వాళ్ళిద్దరూ పారిపోతున్నారు.

సర్వ సాధారణమయిన ప్రేమ కథే. ప్రత్యేకత ఏమీ లేదు. అయితే - రంగడికి సంబంధించి మాత్రం అది ప్రత్యేకత కలిగినదే !

"అమ్మాయిగారూ ! ఇది తప్పండీ" గొంతు పెగల్చుకుని అన్నాడు రంగడు.

"ప్రేమించుకున్నవారిని విడదీయడం పెద్దలు చేయకూడని తప్పు రంగా."

"మీ రిక్షా ఇల్లు వదిలి పారిపోతుంటే నేను చూస్తూ ఊరుకోలేను."

ఆ ఇద్దరూ ఉలిక్కి పడ్డారు. పుష్పమి సర్దుకుంటూ చెప్పింది. "రంగా ! ప్రేమ అన్నది ఎంత గాఢమైందో నీకు తెలియదు. కాబట్టే నువ్విలా అంటున్నావు. ప్రేమించుకున్న వారెప్పుడూ కలిసి జీవించాలనే అనుకుంటారు. అటువంటి వారిని విడదీస్తుంటే ఆ ప్రేమికులు మాత్రం ఏం చేయగలరు నువ్వే చెప్పు !"

ఆ మాటలు రంగడి గుండెలను సూటిగా తాకాయి. 'ప్రేమ అన్నది ఎంత గాఢమయినదో నీకు తెలియదు.' అతడు మనసులోనే నవ్వుకున్నాడు.

"అలా అని పెద్దలను బాధ పెట్టడం మంచిది కాదమ్మాయి గారు. మీరీ ప్రయాణం ఆపండి. నేను అమ్మగారితో మాట్లాడుతాను."

"నువ్వు మాట్లాడినా వారు వినరు." విసుగ్గా అంది పుష్పమి.

ఆ కుర్రాడి ముఖంలో కూడా విసుగు స్పష్టంగా కనిపిస్తూ ఉంది. ముగ్గురూ నడుస్తూ ఉన్నారు. సినిమాలు వదిలి చాలా సమయం కావడంతో వీథి నిర్మానుష్యం అవుతూ ఉంది. బీటు కానిస్టేబుల్ ఎప్పుడయినా అటుగా రావచ్చు. పోలీసువాడి కంటపడితే లేనిపోని సమస్యలు ఎదురవుతాయి. కాబట్టే త్వరగా ఏదో రిక్షా పట్టుకుని రైల్వేస్టేషన్ చేరాలని అనుకుంటున్నాడా కుర్రాడు.

రంగడు కొద్దిసేపు నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

ఆ కుర్రాడు వెళ్తున్న ఖాళీ రిక్షాను పిలిచాడు. రిక్షా దగ్గరగా వస్తూ ఉంది. పుష్పమి రంగడి వైపు తిరిగి చెప్పింది. "రంగా ! మమ్మల్ని వెళ్ళొద్దని వారించి, విడదీయాలని ప్రయత్నించకు. నీకు నా మీద ఏ మాత్రం అభిమానం ఉన్నా నాతో సహకరించు... రైల్వే స్టేషన్ వరకూ వచ్చి నన్ను సాగనంపు."

రంగడి గుండె బాధగా మూలిగింది. అతడు బలవంతంగా తలూపాడు. "అలాగే అమ్మాయి గారూ ! మిమ్మల్ని స్టేషన్ వరకూ సాగనంపుతాను." ఒక నిర్ణయానికి వచ్చి అన్నాడు అతడు.


రిక్షాలో ఎక్కి కూర్చున్నాడు ఆ కుర్రాడు. పక్కనే కూర్చుంది పుష్పమి. అతడికి వారి కాళ్ళ దగ్గరి చోటు మిగిలింది. తప్పలేదు. అక్కడే కూర్చున్నాడు. రిక్షా ముందుకు కదిలింది.

స్టేషన్ చేరాక ఇద్దరి సూట్‌కేసులూ తానే అందుకుని నడిచాడు రంగడు.

ప్లాట్‌ఫారం మీదున్న రైలు ఎటు వెళ్తుందో కనుక్కుని టిక్కెట్స్ పట్టుకొచ్చాడు ఆ కుర్రాడు. ఇద్దరూ రైలెక్కి కూర్చున్నారు.

రైలు కదిలింది.

రంగడు చెయ్యి ఊపుతూ ప్లాట్‌ఫారం మీదే నిలబడ్డాడు. అలా ఎంత సేపో !



రైలు కనుమరుగయింది.

అతడి కన్నులలోని నీరు తెరలు కట్టింది.

** ** **

రంగడు పూర్తిగా నీరసించిపోయాడు. వ్యాపారానికి పోవడం కూడా ఇష్టం లేకపోయింది. గుడిసె మధ్యలో పడుకుని పైకప్పు వంక చూస్తూ ఆలోచనలలో గడిపేవాడు. అది పట్టణం కాబట్టి పుష్పమి 'లేచిపోయిన' సంగతి పెద్దగా సంచలనం కలిగించలేదు. ఆ వీథిలోని వారు ఒకటి రెండు రోజులు అనుకున్నారంతే !

రంగడు ఒకే ఒకసారి మాత్రం ఆ వీథిలోనికి వెళ్ళాడు - ఆ తర్వాత - లక్ష్మీకాంతమ్మ అతడిని చూసి భోరున ఏడ్చేసింది. "అది ఇంత పని చేస్తుందని ఊహించలేదురా. ఊహించి ఉంటే దానిష్ట ప్రకారమే, కోరుకున్న వాడితో మూడుముళ్ళు వేయించి ఉండే వాళ్ళం."

ఓదార్పాలనిపించ లేదు అతడికి. నిర్వికారంగా ఉండిపోయాడు.

కొద్ది రోజులు గడిచాక భుక్తి కోసం తిరిగి పూలబుట్ట చేతపట్టక తప్పలేదు. "మల్లెపూలోయ్... మల్లె పూలోయ్ !" అని అరుస్తుంటే అతడికి మరేదో గుర్తుకు వచ్చింది. ముఖ్యంగా ఆ వీథిలో వెళ్తుంటే మనసు బాధగా మూలిగేది.

ఆరు నెలలు గడిచాయి. అతడి మనఃస్థితిలో మర్పేమీ మార్పులేదు. బహుశా ఆ పరిసరాలు, జ్ఞాపకాలను మరచిపోవటం మంచిదనుకున్నాడు. అందుకే పూరి గుడిసెను తెగనమ్మి పారేశాడు. డబ్బు చేతపట్టుకుని ఊరు విడిచాడు.

ఒకటీ... రెండూ ఊళ్ళు కాదు - చాలా ఊళ్ళు తిరిగాడు. ఎక్కడా కూడా ఎక్కువ రోజులు ఉండలేక పోయేవాడు. చేతిలో డబ్బు కరిగిపో సాగింది. కొన్ని రోజులకు ఆ డబ్బు పూర్తిగా అయిపోయింది.

అతడు పనులు చేసి సంపాదించుకో సాగాడు. కూలీ నాలీ చేసి హొటల్‌లో తిని, ప్లాట్‌ఫారం మీద నిద్రపోవటం మొదలు పెట్టాడు.

ఆ సమయంలోనే అతడికి రాజి అనే అమ్మాయితో మాటలు కలిశాయి. రాజి కూలి పనులకు వచ్చేది కాదు. బస్ స్టాండ్‌లో కూర్చుని పూలు కట్టి అమ్మేది. ఆ చోటే పడుకునే రంగడు 'తనకు అంతకుముందు పూల వ్యాపారం తెలుసు'నని చెప్పడంతో "మరి ఈ కూలి పనుల కన్నా పూల వ్యాపారం చేసుకోకూడదా?" అని ఆమె ప్రోత్సాహ పరిచింది.

కాలానికి జ్ఞాపకాలను మాన్పించే శక్తి ఉంది. అతడు అప్పుడప్పుడే పుష్పమి జ్ఞాపకాలను మరిచిపోతూ ఉన్నాడు. రాజి మాటను అంగీకరించి తిరిగి పూల బుట్ట చేతబట్టాడు.

తను చేసిన గమ్యం లేని ప్రయాణంలో ఇదే చివరి మజిలీ కాబోలు అనుకున్నాడు.

పూల బుట్ట చేతబట్టి చాలాకాలం తర్వాత అరిచాడు. "మల్లెపూలోయ్, మల్లె పూలోయ్ !"

పూల వ్యాపారంలో పది రోజులు గడిచాయి. కాలిన గాయం మానుతున్న స్థితి. రాజి అతడిని ఆప్యాయంగా చూసుకుంటుంది. ఆ ఆప్యాయతకు అర్థం అతడికే ఇంకా తెలిసి రాలేదు.

ఒక రోజు రాజి అతడితో చెప్పింది.

"ఊళ్ళోని అన్ని వీథులూ తిరిగే కన్నా హాయిగా అటు అంకాళమ్మ వీథికి వెళ్ళకూడదూ?"

"అంకాళమ్మ వీథా?... అదెక్కడ" అడిగాడు రంగడు.

"ఊరి చివర. చెరువు పక్కనే".

"అక్కడికి వెళ్తే సరుకు త్వరగా అయిపోతుందా?" ప్రశ్నించాడు అతడు. పాపం ! అతడికి ఆ వీథి చరిత్ర తెలియదు.

"త్వరగా అయిపోతాయి. ఎందుకంటే - ఆ వీథిలో ఇంటికి నలుగురయిదుగురు ఆడవారు వాకిళ్ళలోనే నిలబడి ఉంటారు" అని కిసుక్కున నక్కింది.

రంగడు అమాయకుడేమీ కాదు. కాస్తగా అర్థమయింది. ఆ సాయంత్రం అతడు ఆ వీథిలోకి వ్యాపార నిమిత్తం వెళ్ళాడు.

"మల్లెపూలోయ్... మల్లెపూలోయ్ !"

సూర్యుడు అస్తమిస్తున్నాడు. ఆ వీథంతా అప్పుడే నిద్ర మేల్కొని ఒళ్ళు విరుచుకుంటూ ఉంది. వీథిలో నిద్ర ముఖాలతో తిరుగాడే జనం అతడి కంటికి కొత్తగా కనిపిస్తూ ఉన్నారు.

"మల్లె పూలూ !"

అతడి అడుగులు టక్కున ఆగాయి. ఆ పిలుపు... ఆ పిలుపు...' చప్పున తల తిప్పి అటుగా చూశాడు రంగడు.

భ్రమో - విభ్రమో తెలియని పరిస్థితి.

అతడికి పదడుగుల దూరంలో వాకిలి దగ్గర నిలబడి ఆ ఆకారం తన వంక చూస్తోంది.

అతడి చేతిలోని పూల బుట్ట నేలకు జారింది.

అప్రయోజకుడిని నమ్మి, వెంట బయలుదేరి గూడు విడిచిన రామ చిలుక చివరికి వలలో చిక్కుకుంది. అష్టకష్టాలతో అలసిపోయిందన్న దానికి చిహ్నంగా ఆమె ముఖం వడలిపోయి రేకులు రాలిన పువ్వులా ఉంది.

రంగడు గొంతు పెగల్చుకుని అన్నాడు.

"అమ్మాయి గారూ !". ★